
# ఆకలి

**మొవ్వ బాబూరావు**



వెన్నెల...

చల్లగా హాయి విస్తున్న తెల్లని వెన్నెల.

ఆ ఊరంతా, వాడంతా తెల్లటి చల్లని వెన్నెలలో హాయిగా, ప్రశాంతంగా మైమరచి నిద్రపోతోంది.

ఊరికి దూరంగా ఉన్న మర్రిచెట్టు.

పిదుదులు దాటిన కన్నెపిల్లల జడల్లా చిరుగాలికి నెమ్మదిగా ఊగుతున్నాయి దాని ఊడలు.

ఆ ఊడల తాలూకు నీడలు విసిరేసిన విస్తరాకుల్లా ఊరికి దూరంలో పేదరికానికి బహూ దగ్గరిలో ఉన్న పూరిగుడిసెలపై పడుతుంటే కొండచిలువలే వాటి మీద కాపురం చేస్తున్నాయా అన్నట్లు భ్రాంతి కల్పిస్తోంది ఆ వింత ప్రకృతి.

వాయుదేవుడి కోపాగ్నికి గురయి రొదచేస్తోంది గాలి.

నిలకడలేని గాలిపటంలా కదుల్తున్నాయి పూరిగుడిసెలు

నే నారిపోతే మీ జీవితాలు ఏం కానట్లు? భయపెడుతూ వెలుగుతోంది కిరసనాయిలు ఇంకిపోతున్న గుడ్డిముండా దీపం.

గుక్కతిప్పుకోకుండా ఆలపిస్తున్నాడు చాపమీద శవాకారంలా తల్లి రొమ్ముల మీద పడిఉన్న ఆర్నెల్ల పసికందు. ఆ వయస్సులో అదే తన కర్తవ్యం అన్నట్లు.

ఈ లోకంలో దేన్నైనా జయించ వచ్చు కాని ఆకల్ని జయించలేనన్నట్లుంది వాడి ఏడుపు.

పసికందుని ఓదార్చటం తన బేల తనమని ఏం చేయాలో పాలుపోక కోపంగా వెలిగీ వెలగనట్లున్న దీపం వైపు చూస్తూ అలానే కూర్చుంది చల్లమ్మ.

ఫాక్టరీ కూతలా ఏడుస్తూనే ఉన్నాడు పిల్లాడనబడే ఆ ఎముకల గూడు.

తల్లి ఇచ్చే ఆహారం వాడికి ఏ మూలకి చాలటంలేదు.

తమ చావకుండా ఆకల్ని చంపేసి నిర్భయంగా బ్రతికేస్తున్న తన తల్లి దగ్గర ఏమైనా ఆహారం లభించకపోదా ...తహతహలాడిపోతున్నాడు ఆ పిచ్చి పసికందు.

పక్కగుడిసెలో మంచి నవ్వులు...

చల్లని వెన్నెలలో వెచ్చని పూరి గుడిసెలో,...రాసక్రీడలు.

ఒకపక్క పిల్లాడి ఏడుపు...

మరో వైపున రాసక్రీడల కేరింతలు.

పూరిగుడిసెలో ఏ అధికారో మోక్షం పొందుతున్నట్లున్నాడు. నవ్వులు కేరింతలు...పకపకలూ వికవికలూ...

పిల్లాడి ఏడుపు తారాస్థాయి నందుకుంది.

'ఛీ! ఛీ!' అనుకున్నాడు గుడిసెలోనే జీవామృతం తాగుతున్న రసికరాజు. అది మరి దేనిని ఉద్దేశించో...

తల్లి ఏదైనా తెచ్చిపెడుతుందేమో ననే ఉద్దేశ్యంతో అమాయకంగా ఏడుస్తున్నాడు పిల్లాడు.

పాపం వాడికేం తెలుసు ఆ తల్లి ఏమీ తెచ్చిపెట్టలేదని.

తను ఈ ఆకలికి అతీతురాలవటానికి ఎంతోకాలం పట్టింది. ఆ కాలమే వీడికీ ఓ మార్గం చూపించితీరుతుంది, చల్లమ్మకి ఆ నమ్మకం ఉంది. ఆ పిల్లాడికి నమ్మకం ఉన్నా లేకపోయినా!

ఏడుస్తున్నాడు... అలానే గుక్కతిప్పుకోకుండా తనమీద పడి ఏడుస్తున్నాడు.

అవును తనమీద పడి ఏడవక ఇంకెవరి మీద పడి ఏడుస్తాడు.

పుట్టినప్పుడే తండ్రిని పోగొట్టుకున్నాడు. పోయిన తండ్రి గురించి ఇంకేం ఏడుస్తాడు.

బ్రతికే ఉన్న తల్లిమీద పడి ఏడిస్తేనైనా ఏదైనా లాభసాటి. హూ...పుట్టినప్పుడే గుడిసెదు బుద్ధులు.

శూన్యంలో కూర్చుంది చల్లమ్మ. ఎటుచూసినా అంతా శూన్యమే!

మంచులా, చల్లగా ఉన్న కుండ లోని నీళ్ళని తీసుకొచ్చి పిల్లాడి గొంతులో పోసింది. ఆ సమయానికి అదే అమృతంలా పనిచేసినట్లుంది... మారు మాట్లాడకుండా నోరు మూసేసు కున్నాడు.

కుక్కిన పేనులా పడివున్న పిల్లాడిని చూస్తుంటే గుండె బరువెక్కిపోతోంది.

భర్త పోతూపోతూ తనమీద ఎంత భారం మోపాడూ...తను ఈ భారం, బాధ్యత మోయగలదా? కాని తప్పదు. వీడికోసమే తను బ్రతకాలి. బ్రతికే తీరాలి. కాని...ఎలా?

ఊళ్ళో రెండిళ్ళలో పనికి ఒప్పుకుంది. నెల రోజుల్నించి పనిచెయ్యటం మొద లెట్టింది.

ఆ రెండిళ్ళు మాని తన ఇంట్లో పని చేయమన్నారు మునసబు దంపతులు. మొదట్నించి ఎందుకో తెలీదు మునస బుకి తనంటే ఒక విధమైన అభిమానం. ఆ అభిమానమే తను వాళ్ళింట్లో పనికి కుదరటానికి ఒప్పుకునేటట్లు చేసింది. మునసబంటే ఆ ఊర్లో చాలా మందికి మంచి అభిప్రాయం ఉంది. కాని ఆయన గారి భార్యారత్నమంటేనే అందరికీ ఏవగింపు మునసబు అత్తగారు పట్నం లో వుంటారు. నెలకి రెండు మూడు సార్లు సిటీకి వెళ్ళొస్తుంది మునసబు పెళ్ళాం. వచ్చేటప్పుడు అక్కడి నాగరి కతను కొంతవరకు తనలో ఇముడ్చు కుని ఊళ్ళోకి తీసుకొస్తుంది. ఆమెని చూసి అచ్చం సినిమాస్టార్‌లా ఉంటుం దని ఊళ్ళోవాళ్ళు అంటుంటారు. అసలు సినిమాతారలు ఎలా ఉంటారో చల్లమ్మకి తెలియదు. మునసబు భార్యని చూసిం తరువాత ఇలా మోహానికి, పెదాలకు రంగులేసుకుంటారేమో ననిపించింది.

మునసబు మనస్సు మహా విచిత్రమైనది. అది దేనినీ కొందరగా కోరుకోదు. పొరబాటుగా కోరిందంటే అది నెరవేరిం దాకా వదలదు. ఆ విషయంలో పట్టు వదలని విక్రమార్కుడే!

* * *

కోరికలు రకరకాలు. ఒకొక్కరికి ఒకో విధమైన కోరికుంటుంది. మునస బుకి అన్ని రకాల బలాలున్నాయి. అంగబలం...అర్థబలం...కాని ఇవేవీ అతనికి సంతృప్తి ఇవ్వటం లేదు. అతనికి కావాల్సింది వేరేదొకటుంది. చల్లమ్మని చూడగానే అతని కెంతో సంతృప్తి కలిగింది.

కృత్రిమ అందాన్ని సరిపెట్టుకునే తత్వంకాదు మునసబుది. భార్య అందం బయటివాళ్ళకి ఆనందం కలిగిస్తోందో ఏమోగాని తనకి ఇసుమంత కలిగించటం లేదు.

మునసబు భార్యమీద కొంత దుష్ప్ర చారం కూడా వుంది ఆ ఊళ్ళో. పట్నంలో

ఎవరో షోగ్గాళ్ళతో తిరుగుతుంటే ఆ ఊళ్ళోవాళ్ళల్లో కొంతమంది ప్రత్యక్షంగా చూసిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఈ వార్త మునసబుదాకా వెళ్ళలేదా అన్న సందేహం అనవసరం. పెరట్లో కూర్చుని ప్రపంచాన్ని చూడగలడు మునసబు.

ఇన్ని తెలిసినా సరిపెట్టుకుని ఏమీ తెలీనివాడిలానే ఉండటమే అతనిలోని గొప్పతనం. అందుకనే ప్రజల దృష్టిలో మునసబులోని ప్రవృత్తి ఎప్పుడూ బయటపడలేదు. ఊళ్ళోవాళ్ళకి మునసబు ఎప్పుడూ పెద్దమనిషే.

భార్యని కూడా ఎప్పుడూ ఏమీ అనలేదు. అనీ ప్రయోజనం కూడా లేదని తెలుసు. అందుకే యాభై ఏళ్ళు నిండినా మునసబు అత్తారికి ఇప్పటికీ కొత్త అల్లుడే. మొదట్లో భార్య ప్రవర్తన తెలిసినప్పుడు కొద్దిగా బాధపడ్డాడు. మానవ సహజం కదా? కాని చల్లమ్మని ఇంట్లో చేర్చుకున్న తర్వాత అన్నీ మర్చిపోయాడు. తనకి కావాల్సిన ఔషధం దొరికిందని తెగ మురిసిపోయాడు. భార్యతో ఎప్పటిలానే నిర్జీవంగా సుఖాన్ని పొందుతున్నాడు.

మొదటిసారి...

స్నానం చేసి తడిసిన శరీరం మీద మాలుబట్టని కప్పుకొస్తున్న చల్లమ్మని ఏటిగట్టు దగ్గర చూసాడు. అతని ఆశ్చర్యానికి అంతులేకపోయింది సృష్టిలో ఇంత సౌందర్యం ఉందా అనుకున్నాడు. ఒక్కసారి పెళ్ళాం గుర్తుకొచ్చేసరికి ఏవగింపూ, జుగుప్సా కలిగింది. ఈ అందం ముందు ఆ అందం ఏమందం అనుకున్నాడు. చల్లమ్మని ఆ ఆకృతిలో చూడగానే తనకు కవిత్వం కూడా రావటం మొదలైందేమోనని పులకించిపోయాడు. అతని శరీరంలోని నరాలు జివ్వుమన్నాయి.

ఇంటికి వచ్చేసరికి భార్య ఏదో ఇంటిపని చేస్తోంది? కాస్త అలిసినట్లు కూడా కనిపించింది.

సమయానికి ఎదుటివారి బలహీనతను బయటపెట్టగల నేర్పు ఉండటమే దేవుడు మునసబుకి ఇచ్చిన వరం.


ఉన్నట్లుండి భార్యమీద తెగ సానుభూతిని ప్రదర్శించాడు "ఈ ఇంటి పనులు ఇంకా ఎన్నాళ్ళు చేస్తావు? మనకేం ఖర్మ హాయిగా ఒక మంచి పనిదానిని చూసి పెట్టుకుందాం. కాస్త నీకు విశ్రాంతిగా ఉంటుంది!" పని భారంతో బాధపడని భార్యకి ఆ బాధ కలిగించేటట్లు నిమిషాలమీద చేసేసాడు. నెలకి రెండుమూడు సార్లు సిటీకి వెళ్ళేది వారానికి రెండుమూడుసార్లు వెళ్ళొచ్చులే అని అనుకుని తెగ సంబరపడిపోయింది భర్త తనపై చూపిస్తున్న సానుభూతికి.

రాజుగారు తలచుకుంటే దేనికి కొదవ!

ఆ మర్నాడే చల్లమ్మ మునసబింట్లో



యువ




పనికి కుదిరింది. చల్లమ్మ అందం మునసబు భార్యకి కూడా కించిత్తు అసూయ కలిగించింది. చల్లమ్మ వితంతువని తెలియంగానే కాస్తంత సంతోషం కూడా కలిగింది.

కానీ మునసబుకి మాత్రం జాలి వేసింది ఆమె యవ్వనం అనుభవిస్తున్న బాధని తలచుకుని.

ఇప్పుడు ఆ ఇంట్లో అన్ని పనులూ చల్లమ్మే. చల్లమ్మకి కూడా అక్కడ ఎంతో బాగుంది. తనకీ, తన బిడ్డడికి ఆశ్రయం ఇచ్చిన ఆ దంపతులకు కృతజ్ఞతలు చెప్పుకుంది మనస్సులోనే. రోజూ వేకువజామునే లేచి మునసబు ఇంటికి వచ్చి అప్పటి నుంచి రాత్రి ఏడింటిదాకా ఆ యింటిపనులన్నీ చేయటం ఆమె దిన చర్య.

ఏ విషయంలోనూ తొందరపడని వ్యక్తి మునసబు. ఏ పని ఎప్పుడు ఎలా చేయాలో అతనికి వెన్నతో పెట్టిన విద్య. అందుకే అతను ఆ ఊరి ప్రజలకు దేవుడు.

* * *

ఒక్కసారి ఉలిక్కిపడింది చల్లమ్మ.

రొమ్ముమీద నుంచి నోటిని తీసాడు పిల్లాడు.

ప్రక్క గుడిసెలో నుంచి తాయారు నిట్టూర్పులు బిగ్గరగా వినిపిస్తున్నాయి. ఒకవిధంగా తాయారు అదృష్టవంతురాలు.

జీవితంలో అన్ని విధాల ఓడిపోయి చివరికి తనని ఓడించిన వారందరిని తన యవ్వనంతో గెలుచుకుంటోంది.

జీవితంలో ఓడిపోవటమే మొదటి గెలుపు.

'నేను ఓడిపోతున్నానా? గెలుస్తున్నానా?' తనకి తానే ప్రశ్నించుకుంది చల్లమ్మ.

చిరుదీపం మునసబు యవ్వనంలా బుసలు కొడుతోంది.

మునసబు మాటలే మాటిమాటికి పదే పదే వినిపిస్తున్నాయి.

'చల్లమ్మా నన్ను అనుగ్రహించు..'

కామంతోవున్న కోటీశ్వరుడు యవ్వనాన్ని అనుభవించాలంటే ఎంత వరకు దిగజారుతాడో అప్పుడు తెలిసింది చల్లమ్మకి.

అయితే ఇన్నాళ్ళు తను మునసబు గురించి అనుకున్నది పొరబాటన్నమాట? తనని అతనింటి పనిమనిషిగా పెట్టుకున్న కారణం ఇంత బలమైనదన్నమాట!!

మునసబుకి ఇటువంటి ఆకలి ఉందా?

అతని ఆకల్ని అతను అడిగినప్పుడైనా తను ఎందుకు పనినుంచి తప్పుకోవటంలేదు? అలా తప్పుకుంటే తన ఆకల్ని తీర్చేదెవరు? తను ఎలాగైనా భరిస్తుంది కాని పిల్లాడు...రెండురోజుల్నించి పనికి వెళ్ళటంలేదు. అదే విదర్శనం...వాడి ఈ పరిస్థితికి, ఒకరాకలికి ఒకరు బలి కావల్సిందేనా? ముందుచేసిన రెండిళ్ళలో పనిచేయటమే అయిందిగాని ఏనాడైనా కడుపునిండా తిండి తినగలిగిందా...పిల్లాడి ఆకలి తీర్చగలిగిందా...

ఆలోచనలు కవ్వంతో చిలుకుతున్నట్లయింది.

జరిగిన సంగతి మరచిపోదామన్నా మరవలేకపోతోంది.

ఆరోజు...మునసబు భార్య యధాప్రకారంగా పట్నానికి వెళ్ళింది.

మునసబు ఒక్కడే వాకిట్లో కూర్చుని తెలుగు పేపరు చదువుతున్నాడు. గొడ్లసావిట్లో పిల్లాడి ఆకలి తీరుస్తోంది చల్లమ్మ.

ఎన్నాళ్ళిద్ది మంచో ఎదురుచూస్తున్న సమయం ఆరోజు వచ్చిందనుకున్నాడు మునసబు. ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు.

బయట వీధి గడిగేసి లోపలికి వచ్చి విశ్చేష్టుడై అలానే చూస్తుండిపోయాడు ఎదురుగా కనపడుతున్న దృశ్యాన్ని చూస్తూ!

ఆత్రంగా పిల్లాడు దప్పికని తీర్చుకుంటున్నాడు.

అంతకంటే ఎక్కువ ఆకలి పుడుతోంది మునసబుకి.

ఎవరాకలి వాళ్ళది.


ఒకరి ఆకలి ఒకరికి అర్థంకానిది.

ఒకరు ఆకల్ని తీర్చుకుంటున్నారు.

మరొకరు ఆకల్ని తీర్చుకోవాలనుకుంటున్నారు.

ఇద్దరాకలి తీర్చవలసింది చల్లమ్మే!

హఠాత్తుగా, అనుకోకుండా ఎదురుగుండా విశ్చలంగా తనవంకే చూస్తున్న




మునసబుని చూసేసరికి పైటకొంగు సరి చేసుకుంది చల్లమ్మ.

కొద్దిగా చలించాడు మునసబు.

అతని రాకకు అర్థమేమిటో బోధపడ లేదు చల్లమ్మకి.

ఫ్రేం కట్టిన ఫొటోలా నిశ్చలంగా చల్లమ్మవైపే చూస్తుండిపోయాడు.

"బాబుగారూ..." ప్రశ్నార్థకంగా చల్లమ్మ.

"అమ్మగారు ఎప్పుడొస్తారని చెప్పింది?" తడబడుతూ ప్రశ్నించాడు.

"రేపుదయం వస్తానని చెప్పారు బాబూ!"

ఉదయం అనంగానే మునసబుకి ఆ

రోజు రాత్రి జ్ఞాపకం వచ్చింది. ఎదురు గుండా వున్న చల్లమ్మ, ఐపలు కొడు తున్న ఆమె యవ్వనం ఒంటిని వేడెక్కి స్తోంది. ఈ రాత్రి తనకొక గొప్ప అవ కాశం. ఈ అవకాశాన్ని జారవిడుకో కూడదు.

"రాత్రికి నేను పనిమీద పక్కఊరికి వెళుతున్నాను. ఇంట్లో ఎవరూ ఉండరు. నువ్వింటికి ఈరోజు వెళ్లొద్దు. ఇక్కడే ఉండిపో." ఎదుటిమనిషి దగ్గిర నుంచి ఎటువంటి సమాధానం వినకుండా హడా వుడిగా బయటకు నడిచిపోయాడు మునసబు.

చల్లమ్మకి ఏం చేయాలో పాలు పోలేదు.

మునసబు గురించి తన కీనాటిదాకా సదభిప్రాయం వుంది. కాని...కాని ఈ రోజు అతనిలో ఏదో వింత మార్పు. ఒకసారి ఇటువంటిది ఏదైనా కొత్తగా తెలియవచ్చేసరికి గతాన్ని, గతంలో జరిగిన సంఘటనలు గుర్తుకు రావటం సహజం. ఏనాడో జరిగిన సంఘటనలు సినిమా రీలులా ఇప్పుడు జ్ఞాపకం వస్తు న్నాయి. తను ఇంట్లో పనులు చేస్తున్న ప్పుడు, అంట్లు తోముతున్నప్పుడు ఎన్నో సమయాలలో మునసబు తననే క్రీగంటి చూపులు చూడటం తను ఎన్నోసార్లు గమనించింది. అప్పుడు తనకి ఏమీ అనిపించలేదు. బావిలో చేద లాగుతున్న ప్పుడు అతని చేతులు ఎన్నోసార్లు తన చేతిని తాకాయి. అప్పుడు అతనేదో వింత అనుభూతిని పొందినట్లు చల్లమ్మ కిప్పుడనిపిస్తోంది. తను చివరికి మున సబు ఉచ్చులో పడిందా? అనుమాన మొచ్చింది చల్లమ్మకి. తన ప్రస్తుత కర్తవ్యం ఏమిటి?

మునసబు తనని కోరుకుంటున్నాడా? చల్లమ్మ మనస్సు తొలిచివేస్తోంది.

ఏమనుకుందో ఏమో ఒక నిర్ణయానికి వచ్చింది.

ఆ రాత్రి ధైర్యంచేసి చల్లమ్మ మున సబు ఇంట్లోనే ఉండిపోయింది. చల్లమ్మ అదృష్టమో, మునసబు దురదృష్టమో మునసబుకి నిజంగానే పక్కఊరికి వెళ్ళే పని పడింది.

ఒక విధంగా ఇది మన మంచికేలే అని అనుకున్నాడు మునసబు.

చల్లమ్మ మునసబుపై తనకి కలిగిన అనుమానానికి ఎంతో బాధపడిపోయింది. దేవుడిలాంటి మునసబుని తను ఎంత నీచంగా ఊహించుకుంది. తన్ని తనే తిట్టుకుంది. అప్పటినుంచి మునసబంటే చల్లమ్మకి మరింత గౌరవం పెరిగింది. కాని... ఇప్పుడు జరిగిందేమిటి. మున సబు తనని కోరుకుంటున్నాడు. ఎటు వంటి సిగ్గూ అభిమానం లేకుండా 'చల్లమ్మా నాకు నువ్వు కావాలి' అని ఎంత ఆత్రంగా అడిగాడు.

ఊహించని మునసబు మాటలు విని చల్లమ్మ కోపంతో ఆవేశంగా "ఛీ!

పిచుడా! నీ అసలు రూపం ఇదా! ఇన్నాళ్ళు నువ్వంటే ఎంతో పెద్దమనిషి వమకున్నాను. నిన్ను ఎంతో అభిమా నించాను. నీలో ఇంత కల్మషం దాగుందా? ఉండు నీ పనివడ్తా! ఈ వూరి ప్రజలంతా నిన్ను గౌరవిస్తున్నారు. నీ అసలి రంగు అందరిముందు బయట పెడ్తాను" చల్లమ్మ రుద్రకాళిలా ఊగి పోతోంది.

"పిచ్చిదానా! నువ్వు ఎన్ని చెప్పినా ఎవరూ నమ్మరు సరికదా నిన్ను పిచ్చి దానిక్రింద జమకట్టి బయటకు వెళ్ళగొడ తారు. ఏమైనా పిచ్చిపిచ్చి వేషాలు వేసా వంటే ఈ ఊళ్ళో నీకు, నీ బిడ్డకి నిలువ నీడ లేకుండా చేస్తాను. ఏదో పేదదానివి సహాయం చేస్తే నాకే ఎదురుతిరుగుతా నంటావా! మర్యాదగా నేను చెప్పింది చేయి! నాకు లొంగిపో! మహారాణిలా బ్రతికుంటావు. నీ కొడుకు మహారాజు అవుతాడు. నా ఈ చిన్న కోరిక తీర్చు. నీకే లోటు ఉండదు. ఏదో ఒకటి నిర్ణ యించుకో" అని గడువిచ్చాడు.

చల్లమ్మ పరిగెత్తుకుంటూ పాకలోకి వచ్చేసింది. అప్పటినుంచీ మళ్ళీ మున సబింటికి వెళ్ళలేదు. మునసబు భార్య పట్నానికి వెళ్ళి అప్పుడే వారం అయింది. ఇంకా రాలేదు.

మునసబు తనని కోరుకుంటున్నాడు.

దేనికి...ఆకలి తీర్చటానికి.

తనూ కోరుకుంటోంది ఆ ఆకలి తీర్చే మందు ఇవ్వమని. ఆ మందు వూళ్ళో ఎవ్వరూ ఇవ్వరూ! ఇవ్వలేరు! నే నిస్తా నంటున్నాడు మునసబు. అందుకు తను అతని కోరిక తీర్చాలి. తన బిడ్డ బ్రతకా లంటే తను మునసబుకి అమ్ముడు పోవాలి. గత్యంతరం లేదు...తప్పదు.

చల్లమ్మ ఏదో నిర్ణయానికి వచ్చింది.

తెల్లారింది. చంకలో పిల్లాడ్ని వేసు కుని మునసబు ఇంటికి దారితీసింది. తన నిర్ణయాన్ని మునసబుకి తెలియచేసింది. ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు మునసబు. యింతలో ఎంత మార్పు అనుకున్నాడు.

ఆ గదిలో ఆ మంచంమీద ఎన్నాళ్ళి నుంచో అదుపులో పెట్టుకున్న తన కోరి కను ఎటువంటి నిర్బంధనా లేకుండా తనివితీరా తీర్చుకుంటున్నాడు మునసబు.

బయట నుంచి వినిపిస్తున్న పిల్లాడి ఏడుపు అతన్లో ఎటువంటి చలనం కలిగిం చటం లేదు. చల్లమ్మ యవ్వనాన్ని అతని కోరికల కోరలు కాటేస్తున్నాయి. ఇప్పుడు ఆ ఏడుపు కూడా అతనికి విన బడటం లేదు.

చల్లమ్మకి వినపడేది అదొక్కటే!

ఛళ్ళున తలుపులు తెరుచుకున్నాయి.

ఊహించని దృశ్యం చూసేసరికి లోపలికి వచ్చినవాళ్ళూ గదిలో ఉన్న వాళ్ళు దిగ్భ్రాంతులై పోయారు.

"దొమ్మరిముండా నా మొగుడే నీకు దొరికాడా" చల్లమ్మ జుట్టు మునసబు భార్య హస్తాల్లో చిక్కుకుపోయింది.

"అమ్మగారూ! నన్ను క్షమించండి! నాకే పాపం తెలీదు" వేడుకుంటోంది మునసబుభార్య కాళ్ళమీదపడి చల్లమ్మ దీనాతిదీనంగా.

"నేను వూళ్ళో లేనని తెలుసుకుని ఇంత ఘోరానికి ఒడిగడ్తావా!" చల్లమ్మ ఒళ్ళు హూనం అయిపోతోంది.

బయట జనం...లోపల జనం... చల్లమ్మ ఒంటిమీద ఆ జనం చేతులు... వాటి ముద్రలు..."దైవంలాంటి మునసబుని ఎంత యిదిగా లొంగదీసుకుందా మనుకుంది ఈ లం..." ఒకొక్కళ్ళు ఒకో మాట... మునసబు సిగ్గుపడిపోయాడు.

బరబరా చల్లమ్మని బయటకు లాక్కొచ్చి వీధిలో వాయించేస్తోంది మునసబు భార్య. గుక్కతిప్పుకోకుండాం ఏడుస్తున్న పిల్లాడ్ని పట్టుకొచ్చి చల్లమ్మ వైపు గిరాటేసాడు మునసబు.

ఊళ్లోవాళ్ళ ఆకల్ని తీర్చే తల్లి తన ఆకల్ని తీర్చలేదా అన్నట్లు తల్లిమీద పడి ఆకలి తీర్చుకోటం కోసం వెతుకుతున్నాడు చంటాడు.

నిర్జీవంగా, నిస్సహాయంగా అలా రోడ్డుమీదే పడి బిడ్డని శరీరానికి హత్తుకుంది చల్లమ్మ.

చల్లమ్మలోని వింత సోయగాలని చూస్తున్నారు అక్కడ గుమిగూడిన ఊరి జనం.

ఆకలి తీరని మునసబు అలానే చల్లమ్మని చూస్తూ నిలబడిపోయాడు.

